

# వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం



**సంజీవరెడ్డి నగర్, జూలై 1 ప్రభాతవార్త:** లక్షలాది మంది భక్తులతో అంగరంగ వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం రాజకీయాలకు అతీతంగా జరిగింది. బల్కంపేట ఎల్లమ్మకు పట్టు వస్త్రాలను,ముత్యాల తలంబ్రాలను సమర్పించిన రాష్ట్ర మంత్రులు కొండ సురేఖ, పొన్నం ప్రభాకర్ దంపతులు,ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు కళ్యాణోత్సవాన్ని తిలకిస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో విపత్తు వచ్చి వందలాది మంది చనిపోతున్నప్పుడు బల్కంపేట ఎల్లమ్మ తల్లి రక్షణగా నిలిచిందని ఆయన అన్నారు. అమ్మవారి కళ్యాణం సందర్భంగా రాష్ట్రమంతా మంచి వర్షాలు, పండిపంటలు, ప్రజలంతా ఆరోగ్యం సుబిక్షంగా ఉండాలని ఆయన అమ్మవారిని కోరుకున్నామన్నారు. మంగళవారం బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణానికి హాజరైన తలసానిని ఆలయ పండితులు, సిబ్బంది పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ బల్కంపేట ఎల్లమ్మ తల్లి దివెనలతో రాష్ట్ర మంతా సుబిక్షంగా, ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలన్నారు. భక్తుల కొరికెలు తీర్చే అమ్మగా పూజలు అందుకుంటున్న ఎల్లమ్మ తల్లికి ప్ర తి ఏటా లక్షలాది మంది వివిధ ప్రాంతాల నుంచి వస్తారని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 10 సంవత్సరాలలో ఆలయాన్ని ఎంతో అభి వృద్ధి చేయడం జరిగిందన్నారు. పుణ్యక్షేత్రం మా దిరిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం,దాతల సహకారంతో అనేక అభివృద్ధి పనులను చేసిన వి షయాన్ని వివరించారు. ఎస్. ఆర్.నగర్ ఇన్‌స్పె క్టర్ శ్రీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలు జరుకుండా తగుజాగ్రత్తలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, సనత్ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్ ఛార్జ్ డాక్టర్ కోట నీలిమా,హైదరాబాద్ జిల్లా కలెక్ట ర్ హరిచందన, జిహెచ్ఎంసి కమిష నర్ కర్ణ న్, హైదరాబాద్ కమిషనర్ సి.వి. ఆనం ద్, శాంతికుమారి, అనీల్ యాదవ్, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, స్థానిక కార్పోరేటర్ సరళ, అమీ ర్‌పేట కార్పోరేటర్ శేషుకుమారి, ఆలయ సిబ్బంది, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి, హన్మంతరావ్, అకుల హరిక్రిష్ణ, సీనియర్ నాయకులు అశోక్ యాదవ్, ప్రవీణ్‌రెడ్డి, నామన సంతోష్ కుమా ర్,శ్రీహరి,కొలను భూపాల్ రెడ్డి, బాస లక్ష్మి, కట్ట బలరామ్, గోపిలాల్ చౌహాన్, వనం శ్రీనివాస్, నారాయణ రాజు, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ వార్త



# రెసిడెన్షియల్ స్కూళ్లలో మెరుగైన బోధన జరగాలి

**-విద్యార్థులు ఎంచుకున్న క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి**
**-జాతీయ, అతర్జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దాలి**
**-సంక్షేమశాఖల సమీక్షా సమావేశంలో కలెక్టర్ హరిచందన దాసరి**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన దాసరి

**హైదరాబాద్, జూలై 1,ప్రభాతవార్త:** రెసిడెన్షియల్ స్కూళ్లు, ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో మెరుగైన విద్యాబోధన జరగాలని అలాగే విద్యార్థుల ఎంచుకున్న క్రీడలపై ప్రత్యేక శిక్షణ అందించి దేశ అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో రాణించేలాతీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్లో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో సంక్షేమ పథకాల అమలు తీరు, వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల పనితీరు, అందుతున్న విద్యా బోధన పై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు చేరేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఎస్‌సి పరీక్ష ఫలితాలు మెరుగ్గా ఉన్నప్పటికీ ఇంటర్మీడియట్లో ఈ సంవత్సరం ఫలితాలు మెరుగ్గా ఉండాలని ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించాలని సూచించారు. అలాగే గిరిజన సంక్షేమ శాఖ ద్వారా అంబేద్కర్ ఓవర్సీస్ విద్య నిది కింద విద్యార్థుల ఉన్నత చదువులకై రెండు విడుదతలలో పదిలక్షల చొప్పున 20 మంది విద్యార్థులకు అందించడం జరిగిందని తెలిపారు. యువత ఆర్థిక బలోపేతానికి చేయూతను అందించే దిశగా ట్రై కార్ సంస్థ ద్వారా సబ్సిడీ కూడా అందించడం జరిగిందని అన్నారు. గిరిజన విద్యార్థులు బోపాల్‌లో జరిగిన డ్రాగన్ బోట్ క్రీడలో జాతీయస్థాయి విజయం సాధించడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. సోషల్ వెల్ఫేర్ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు పదో తరగతి పరీక్షలలో 92 శాతం ఉత్తీర్ణత ఫలితాలు ఉన్నాయని ఆమె తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో నూటికి నూరు శాతం ఫలితాలు వచ్చేలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా ఉర్దూ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్స్ అలాగే కళాశాలలో నాణ్యమైన విద్యాబోధన అందాలని ఆమె తెలిపారు. అలాగే జిల్లాలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎం ఓవర్సీస్ స్కాలర్షిప్ స్కీం, కులాంతర వివాహాల ప్రోత్సాహకాలు, ఫీజు రియంబర్స్మెంట్, డైట్ చార్జీలు, స్టడీ సర్కిల్‌ల నిర్వహణపై ఆమె శాఖల వారీగా సమీక్షించారు. ఈసమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు జి ఆశన్న, సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ప్రవీణ్ కుమార్, గిరిజన సంక్షేమ అధికారి కోటజీ, మైనార్టీ సంక్షేమ అధికారి ఇలియాస్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# ఒసిల జారీల్లో అక్రమాలపై రాష్ట్ర విజిలెన్స్ అధికారులు దృష్టి సారించేనా?

**-సర్కిల్ 23 ఎసిపి కార్యాలయంలో రెచ్చిపోతున్న అవినీతి తిమింగళాలు**
**-ఒసిల జారీలో గోల్‌మాల్, కాసులు ఇస్తేనే నిర్మాణాలకు అనుమతి**



**కూకట్‌పల్లి జోన్ ప్రతినిధి, జులై 1, ప్రభాతవార్త:** మూసాపేట్ సర్కిల్ 23 ఏసీపీ కార్యాలయంలో భవణ నిర్మాణాల అక్యుపెన్సి (ఒసి)ల జారీలో కొందరు అధికారులు అనేక అక్రమాలకు పాల్పడుతున్నారు. నిబంధనలు పాటించని డీవీషన్లకు పాల్పడుతున్న అనేక మంది బిల్డర్ల నిర్మాణదారుల భవనాలకు ఓసిలను జారి చేస్తూ ఓ ఇద్దరు అధికారులు అనేక అక్రమాలకు పాల్పడుతూ రూ. కోట్లను దండుకుంటున్నారు. ఈ ఇద్దరు అధికారుల అక్రమ వసూళ్లపై రాష్ట్ర విజిలెన్స్ అధికారులు విచారణ చేస్తే వీరి అవినీతి భాగోతంబయడటపడుతుంది. నిర్మాణం పూర్తయ్యాక ప్రణాళిక (ప్లాన్ ప్రకారం) ఉన్నాయా లేవా అనే విషయాలను పరిగణలోకి తీసుకోకుండానే నివాసయోగ్య పత్రాలను జారీచేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొందరు టౌన్‌ప్లానింగ్ అధికారులు బిల్డర్లు, యజమానుల నుంచి ముడుపులు తీసుకుని సెట్ బ్యాక్‌లేని ఇళ్ళకు, నిబంధనలు పాటించని వారికి ఒకే చెబుతున్నారు. తీసుకున్న అనుమతుల ప్రకారం భవన నిర్మాణం అయిందా, లేదా అన్న విషయాన్ని క్షేత్రస్థాయిలో తనిఖీ చేసుకున్న తర్వాతే అసిస్టెంటట్ సిటీ ప్లానర్‌తో పాటు టౌన్ ప్లానింగ్ అధికారులు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు జారీ చేయాల్సి ఉంటుంది. ఓ వైపు నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలకు ఓసీలు జారీ అవుతుండగా మరో వైపు ఓసీలు జారి అయిన భవనాలపై అదనంగా రెండు మూడు అంతస్తులను బిల్డర్లు నిర్మిస్తున్నా ఏసీపీ, టీపీఎస్‌లు అడ్డుకోకుండా తమ వంతు సహకారం అందిస్తున్నారు. అనేక ప్రాంతాల్లో బహుళ అంతస్తుల భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు జారీ అయిన తర్వాత భవనంపై భాగంలో మళ్లీ అక్రమనిర్మాణాలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయి. మూసాపేట సర్కిల్ 23లోని పలు ప్రాంతాల్లో జి ప్లస్ టూ వరకు భవన నిర్మాణాలకు అనుమతి తీసుకుని అనేక మంది టౌన్ ప్లానింగ్ అధికారుల అండదండలతో నిబంధనలకు విరుద్ధంగా ఐదారు అంతస్తులు నిర్మిన్నారు. అడ్డు అదుపు లేకుండా కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఏసీపీతోపాటు టీపీఎస్ ఘోరంగా విఫలమవుతున్నారు. కెపిహెచ్బికాలనీ, బాలాజీనగర్, సర్దార్‌పటేల్‌నగర్, కైత్లాపూర్, బాలాజీనగర్ హౌసింగ్ బోర్డు కాలనీ, వసంత్‌నగర్ తదితర ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలకు అడ్డు అదువులేకుండా పోయింది. జట్‌వేగంతో అభివృద్ధి చెందుతున్న పలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు అదే రీతిలో జోరుగా హుషారుగా కొనసాగుతున్నాయి. అనేక ప్రాంతాల్లో వ్యక్తిగత గృహ నిర్మాణాలతో పాటు వ్యాపార, వాణిజ్య సముదాయాలు, అపార్టెమెంట్లు పెద్దఎత్తున కొనసాగుతున్నాయి. దీంతో అధిక శాతం నిబంధనల్ని ఉల్లంఘిస్తూ నిర్మిస్తున్నవే. ఇద్దరు ఘనాపాటీల అక్రమ వసూళ్లు ఇలా..

**ఒక్కో భవనానికి లక్షలు వసూళ్లు**

మూపాపేట సర్కిల్ 23 కార్యాలయం పరిధిలోని అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ (టీపీఎస్) కార్యాలయాలలో ఓ ఇద్దరు అవినీతి ఘనాపాటీలు అక్రమ బహుళ అంతస్తుల భవనం, కమర్షియల్ భవనాల వద్ద రూ.10లక్షల నుంచి రూ.30లక్షలకు పైగా నిర్మాణదారులు బిల్డర్ల వద్ద అక్రమ వసూళ్లను చేయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అక్రమ భవనాల వద్ద తమ ఇష్టారాజ్యంగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఓ ఇద్దరు అధికారులపై విచారణ జరిపించడంలో రాష్ట్ర విజిలెన్స్ విభాగం ఘోరంగా విఫలమవుతున్నారు.

# హైడ్రా మాన్సూన్ టీమ్స్‌రెడీ..

**-రంగంలోకి దిగిన 150 బృందాలు**
**-స్టాటిక్,డిఆర్ఎఫ్,ట్రాఫిక్ సిబ్బంది సైతం**
**-మొత్తం 4100మందితో నగరవ్యాప్తంగా సేవలు**

**హైదరాబాద్, జులై 1,ప్రభాతవార్త:** వర్షాకాలం నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోడానికి హైడ్రా పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. 150 మాన్సూన్ ఎమర్జన్సీ టీమ్‌లను రంగంలోకి దించింది. ఒక్కో షిఫ్టులో నలుగురు చొప్పున మూడు షిఫ్టుల్లో పని చేస్తారు. ఇలా 150 మాన్సూన్ ఎమర్జన్సీ బృందాల్లో మొత్తం 1800ల మంది ఉంటారు. వర్షపు నీరు నిలిచే (368 స్టాటిక్ టీమ్‌లు) చోట రెండు షిఫ్టుల్లో పని చేసేలా 734 మంది సిద్ధమయ్యారు. వీరికి తోడు హైడ్రా డీఆర్ ఎఫ్ బృందాలు 51 వర్షాకాలం పనుల్లో నిమగ్నమయ్యాయి. ఒక్కో టీమ్‌లో 18 మంది ఉంటారు. ఇలా డీఆర్ ఎఫ్ సిబ్బంది 918 మంది సేవలందిస్తారు. వీరు ఒక్కో షిఫ్టుల్లో ఆరుగురు చొప్పున పని చేస్తారు. వీరికి తోడు ఎమర్జన్సీ బైకు బృందాలు 21 ఉన్నాయి. ఒక్కో బైకుపైన ఇద్దరు చొప్పున మొత్తం 42 మంది పని చేస్తారు. 30 సర్కిళ్లలో పనులను పర్యవేక్షించేందుకు హైడ్రాకు చెందిన మార్షల్స్ 30 మంది ఉంటారు. ట్రాఫిక్ పోలీసులతో కలసి పని చేసేందుకు రెండు షిఫ్టుల్లో కలిపి 200ల మందితో 20 బృందాలు, చెట్టుకొమ్మలు, చెత్తను ఎత్తుకెళ్లేందుకు వీలుగా.. ఒక్కో షిఫ్టులో ముగ్గురు చొప్పున ఉండేలా 240 మంది అందుబాటులో ఉంటారు. ఇలా అధికారులతో కలిపి వర్షాకాలం ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూసేందుకు మొత్తం 4100 మంది సేవలందిస్తారు.



సేవలకు సిద్ధమైన మాన్సూన్ టీమ్స్

**24 గంటలూ అప్రమత్తంగా ఉండాలి..**

వర్షం ఎప్పుడు వస్తుందో ఎంత మొత్తంలో పడుతుందో అంచనా వేయలేని పరిస్థితుల్లో మాన్సూన్ ఎమర్జన్సీ టీమ్(ఎంఈటీ)లు 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ రంగనాథ్ సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. వర్షానికి ముందే రహదారుల్లో నీరు వెళ్లేందుకు ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. నాలాలను, కల్వర్టులను పరిశీలించి.. వరద నీటి ప్రవాహం సాఫీగా సాగేలా జాగ్రత్తపడాలన్నారు. ఎక్కడ నీరు నిలుస్తుందో ముందుగానే ఒక అంచనాకు వచ్చి.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. చెట్లు పడిపోతే వెంటనే వాటిని తొలగించాలి. హైడ్రా డీఆర్ ఎఫ్ బృందాలు కూడా సహకరిస్తాయని.. సమన్వయంతో పని చేయాల్సినవసరం ఉందని చెప్పారు. ఎక్కడ ఏ సమస్య ఉన్నా ఆయా ప్రాంతాల హైడ్రా ఎస్ఎఫ్‌వోలకు తెలియజేయడమే కాకుండా.. ఆ సమాచారాన్ని హైడ్రా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

**పని ముట్లు పంపిణీ..**

వరద నీరు నిలిచిన వెంటనే తోడేందుకు నీటి పంపులు, చెట్లు పడిపోతే తొలగించడానికి కటింగ్ మెషిన్లు, చెత్తను తొలగించడానికి అవసరమైన పరికరాలన్నీ 150 స్టాటిక్ బృందాలతో పాటు.. 51 డీఆర్ఎఫ్ బృందాలకు అప్పగించారు. వర్షాకాలంలో పని చేసే ఈ బృందాలన్నిటికీ ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి సేవల తీరును వివరించారు. ఈ బృందాలన్నీ ఆయా డివిజన్లలో ఉండి సేవలందిస్తాయి. ఆ డివిజన్ వరకూ ఎక్కడా ఇబ్బంది ఉన్నా వీరు బాధ్యతపడి.. సమస్యను పరిష్కరిస్తారు. ట్రాఫిక్ సాఫీగా సాగేలా ట్రాఫిక్ పోలీసులతో 20 బృందాలు పని చేస్తాయి. అలా గే చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేందుకు తగిన వాహనాలను,పని ముట్లను కూడా హైడ్రా సమకూర్చింది. మొత్తం 242 మంది ఈ విధుల్లో ఉంటారు.

# చిత్రపురి కాలనీలో విల్లాను కూల్చిన మున్సిపల్ అధికారులు

**- ఒక్కరోజు గడువు అడిగిన మరో విల్లా యజమాని**
**- హిటాచిని అక్కడే ఉంచి వెనుదిరిగిన టౌన్‌ప్లానింగ్ అధికారి**
**- 15.ఏళ్ల తరువాత అక్రమ నిర్మాణం కనిపించిదా అని నిలదీసిన స్థానికులు**



మణికొండ చిత్రపురి కాలనీలో అనుమతి లేకుండా వెలిసిన విల్లాను హైడ్రా ఆదేశాల మేరకు కూల్చివేస్తున్న దృశ్యం

**నార్సింగి, జులై 1 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీ పరిధి చిత్రపురి కాలనీలో అనుమతి లేకుండా నిర్మించిన విల్లాలను కూల్చివేయాలంటూ చిత్రపురి సాధన సమితి అధ్యక్షులు కస్తూరి శ్రీనివాస్ కోర్టును ఆశ్రయించారు. మున్సిపల్, హెచ్ఎండిఏల నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండా రోడ్డుపై నిర్మించిన 6. అక్రమ కట్టడాలను కూల్చి వేయాలంటూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలతో గతంలో 4.విల్లాలను టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. మిగిలిన రెండు విల్లాలను కూడా కూల్చాలంటూ శ్రీనివాస్ ఇటీవల హైడ్రాను సంప్రదించారు. అన్ని డాక్యుమెంట్లు, అనుమతులు పరిశీలించిన తరువాత హైడ్రా అధికారులు మున్సిపల్ అధికారులకు ఫోన్‌చేసి సదరు అనుమతి లేని రెండు విల్లాలను కూల్చివేయలని ఆదేశించింది. హైడ్రా ఆదేశాల మేరకు మణికొండ మున్సిపల్ కమీషనర్ ప్రదీప్ కుమార్ మంగళవారం చిత్రపురికి టిపిఓ సంతోష్ సింగ్‌ను పోలీసు బందోబస్తుతో పంపించారు. భారీ హిటాచితో ఓ విల్లాను తుక్కుతుక్కుగా కొట్టి నేలమట్టం చేశారు. మరో విల్లాను కూల్చేందుకు వెళ్లగా అందులో అద్దెకుంటున్న వారు సామాగ్రిని బుధవారం ఉదయం 8.గంటల వరకు తీసివేస్తామని, అప్పటి వరకు గడువు ఇవ్వాలని టిపిఓను వేడుకున్నారు. అలాగే చిత్రపురి కాలనీ సభ్యులు అలహరి సైతం టౌన్‌ప్లానింగ్ అధికారులను గడువు ఇవ్వాలని అడిగారు. దీంతో టిపిఓ సంతోష్ సింగ్ వెనక్కి తగ్గి, బుధవారం ఉదయం 9.గంటల వరకు మొత్తం సామాగ్రిని తీసుకొని ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని, అప్పటి వరకు మా హిటాచీని ఇక్కడే ఉంచి వెళ్తామని అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ విల్లాకు ఎలాంటి అనుమతులు లేనందుకే కూల్చి వేసేందుకు వచ్చామని టిపిఓ స్పష్టం చేశారు.

**అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానికులు**

మున్సిపల్ అధికారుల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు, టౌన్‌ప్లానింగ్ అధికారులు, చిత్రపురి కాలనీ అధ్యక్షులపై మండిపడ్డారు. అక్రమ నిర్మాణంను జరుపుతుంటే నిర్మాణ సమయంలోనే అధికారులు అడ్డుకోవాలని, 15.ఏళ్ల తరువాత వచ్చి ఇది అక్రమ నిర్మాణమని, కూల్చివేస్తామని దబాయించడం ఎంత వరకు న్యాయమని స్థానికులు ఎల్లారెడ్డి ప్రశ్నించారు. గతంలో, ఇప్పుడు చిత్రపురి కాలనీ అధ్యక్షులుగా పని చేసిన వారు అక్రమ నిర్మాణంను రెగ్యులరైజ్ చేయిస్తామని నిర్మాణదారుల నుంచి బందిపోటు దొంగల్లాగా లక్షల రూపాయల డబ్బులు వసూలు చేసుకెళ్లారని, ఇప్పుడు కొన్న వారికి ఇబ్బందులు సృష్టిస్తుంటే వారంతా ఎక్కడ దాక్కున్నారని మండి పడ్డారు. చిత్రపురి కాలనీలో వందల కోట్ల స్కాంలు చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడంలో మీనామేషాలు లెక్కబెట్టే అధికారులు కష్టపడి సంపాదించిన సొమ్ముతో ఇళ్లను కొన్న వారిపై మాత్రం ప్రతాపం చూపించడం ఎంత వరకు న్యాయమని నిలదీశారు. నా వద్ద కోర్టు ఇచ్చిన స్టేటస్కో ఆర్డర్ ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఇంటి యజమాని ఆవేదన వ్యక్తం చేశారు.

# డిఎంహెచ్‌వో కార్యాలయంలో జాతీయ వైద్యుల దినోత్సవం



ప్రోగ్రాం,పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లకు ట్యాబ్‌లు అందజేస్తున్న డిఎంహెచ్‌వో డాక్టర్ వెంకటి

**హైదరాబాద్,జూలై 1,ప్రభాతవార్త:** జిల్లా డిఎంహెచ్‌వో కార్యాలయంలో మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి వైద్యులు, సిబ్బంది హాజరై వైద్యరంగం యొక్క విషిష్టతను చాటి చెప్పారు. ఈసందర్భంగా డిఎంహెచ్‌వో డాక్టర్ వెంకటి మాట్లాడుతూ ప్రతి కోలుకున్న రోగి వెనక ఒకవైద్యుడు ఉంటాడని అన్నారు. వైద్యుల నిస్వార్థ సేవకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని ఆసుపత్రిని" వైద్య ఆలయం" గా భావించి రోగులకు ప్రాణ ప్రసాదాన్ని కలిసి ఆయుష్షని పెంచేలా కృషి చేయాలన్నారు. జిల్లాలో ప్రోగ్రామ్ ఆఫీసర్స్, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్స్, వైద్యులు అందరు సమిష్టిగా ప్రజలకు అవిశ్రాంతంగా సేవలందించడం వల్ల అన్ని కార్యక్రమాలను జయప్రదం చేస్తున్నానిమన్నారు. ప్రతి పండుగకు, ఉత్సవాలకు, వివిధ కార్యక్రమాలకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు నిరంతర వైద్య సేవలు అందించడంలో హైదరాబాదు జిల్లా వైద్యులు అభినందనీయులన్నారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం ఆఫీసర్స్, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్స్‌కు టాబ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ శ్రీధర్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీకళ, డా: మురళీధర్, హర్ష యాదవ్, డా అనిత, డాఅవంతి ,డా మనోజ్ , జక్కుల రాములు తదితరులు పాల్గొన్నారు.

# నగరానికి ఎల్లో అలర్ట్..

**-ఈదురుగాలులతో కూడిన వర్షం -పలు ప్రాంతాల్లో రోడ్లన్నీ జలమయం**



**హైదరాబాద్, జూలై 1 ,ప్రభాతవార్త:** నగరంలో మంగళవారం భారీ వర్షకురిసింది. పలు ప్రాంతాల్లో భారీ వర్షం కారణంగా జనజీవనం అస్థవ్యస్థంగా మారింది. కొన్నిచోట్ల డ్రైన్లు పొంగడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగరంలోని జూబ్లీహిల్స్, ఫిల్మ్ నగర్, మణికొండ, బంజారా హిల్స్, పంజాగుట్ట, బల్కంపేట, బేగంపేట్, ఎస్సా ర్ నగర్, అమీర్ పేట్, కూకట్ పల్లి, గచ్చిబౌలి, టోలీచౌకీ, మెహదీపట్నం, సైనిక్ పురి, సికింద్రాబాద్, వనస్థలిపురం, మియా పూర్, తార్నాక తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం నుంచీ ఎడతెరిపిలేకుండా ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో నగరానికి వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఆకాశం మేఘావృతమై, తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలకు అవకాశం ఉందని పేర్కొంది. ఈదురుగాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని నగర వాసులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అత్యధికంగా బీహెచ్ ఈఎల్ లో 2.08 సెం టీమీటర్లు, లింగంపల్లి ఎంఎంటీఎస్ పరిధిలో 2.05, షేక్ పేట 1.95, గచ్చిబౌలిలో 1.93 సెంటిమీటర్ల వర్షం పడింది. ఇక, నగరంలో రేపు కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. బుధవారం 6.45 సెంటిమీటర్ల నుంచి 11.55 సెంటి మీటర్ల వరకు వర్షం కురిసే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ ఎల్లోఅలర్ట్ జారీ చేసింది.

## గోల్కొండ శ్రీ జగదాంబికా మహంకాళి దేవాలయ హుండీ ఆదాయం రూ.3,29,262



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న కమిటీ చైర్మన్, సభ్యులు, అధికారులు

**మెహిదీపట్నం, జులై 1, ప్రభాతవార్త :** గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళి దేవాలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. బోనాల ఉత్సవాలలో భాగంగా ఇప్పటి వరకు అమ్మవారికి మొదటి, రెండు పూజలు నిర్వహించగా వచ్చిన హుండీ ఆదాయం రూ. 3,29,262 రూపాయల ఆదాయం వచ్చిందని ఆలయ కమిటీ చైర్మన్ కొండెపూడి చంటిబాబు తెలిపారు. హుండీ లెక్కింపుల్లో ఈ.ఓ. వసంత, కమిటీ సభ్యులు ఎరుకల సంతోష్ కుమార్ గౌడ్, సింగోజిగిరి, అనిత, సంతోష్ గౌడ్, శంకర్, నరేష్, నర్సింగ్ రావు, శివశంకర్, సర్వేశ్ చారి, సురేష్ చారి, రవి, శ్రావణ్, నవీన్, నరేందర్, విజయ్, రాజు, శివ రాజ్ లు పాల్గొన్నారు.

## జనశక్తినేత అమర్‌కు కృతజ్ఞతలు తెలిపిన మంద కృష్ణ మాదిగ



అమర్‌ను శాలువాతో సత్కరిస్తున్న మంద కృష్ణ మాదిగ

**నిజాంపేట్, జులై 1, ప్రభాతవార్త**

ఎస్సీ వర్గీకరణ కోసం చేసిన పోరాటం విజయం సాధించిన నేపథ్యంలో ఉద్యమానికి మద్దతుగా నిలిచిన జనశక్తి నేత అమర్‌కి ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు వారి నివాసంలో అమర్‌కి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. అమర్ మార్గనిర్దేశంలోనే అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కన్వీనర్ విమలక్క "మాదిగొల్ల దప్పులు వచ్చేనే మానవ హక్కుల దండోరా వేసి" అనే పాటను గానం చేసి ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి మద్దతు తెలిపారు. అలాగే ఎమ్మార్పీఎస్ నిర్వహించిన అనేక సభల్లో, అనేక పోరాటాల్లో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కన్వీనర్ విమలక్క ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఇటీవల ఎస్సీ వర్గీకరణను సాధించుకున్న నేపథ్యంలో ఉద్యమానికి మద్దతుగా నిలిచిన తీరును గుర్తించుకొని మంగళవారం అమర్‌కి మంద కృష్ణ మాదిగ కృతజ్ఞతలు తెలిపారు.

## ఆపదలో సిఎం సహాయనిధి చేయూత



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న కొలన్ హన్మంత్ రెడ్డి

**నిజాంపేట్, జులై 1, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిజాంపేట్ సిహెచ్. శ్రీనివాసా రావు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతు నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుటకు ఆర్ధిక స్థోమత లేదని తెలుసుకున్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా బాధితుడికి శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 2,50,000 సీఎం సహాయనిధి ఎల్వోసీని మంజూరి చేయించారు. మంజూరైన ఆర్థిక సహాయాన్ని మంగళవారం శ్రీనివాసా రావుకి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు జక్కుల మల్లేష్ యాదవ్, దూసకంటి పద్మ రావు, గోపాల్ యాదవ్, సంజీవ రెడ్డి, అంజాద్, నర్సింగ్ రావు, ఎండీ. షకీల్ ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధే నా ప్రధమ కర్తవ్యం : ఎమ్మెల్యే



సమస్యలు వింటున్న ఎమ్మెల్యే వివేకానంద

**పేట్ బషీరాబాద్, జులై 1, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకోవడం, వెంటనే పరిష్కారం అందించడం లక్ష్యంగా ఎమ్మెల్యే కె.పి. వివేకానంద ప్రతీరోజు ఉదయం తన నివాసంలో ప్రజలకు అందుబాటులో వుంటూ వారితో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల ప్రజలు పాల్గొని డ్రైనేజ్, రోడ్లు, మంచినీటి సరఫరా, విద్యుత్ సమస్యలు, పింఛన్లు, హౌసింగ్, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమస్యలు ఎమ్మెల్యేకి వివరించారు. ప్రతీ ఒక్కరి ఫిర్యాదును శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే సంబంధిత శాఖ అధికారులను టెలిఫోన్ ద్వారా సంప్రదించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలు నా సమస్యలేనని, ప్రతి ఒక్కరు నన్ను నమ్మి వచ్చిన విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం నా బాధ్యత అని అన్నారు. నేను ప్రజల అభిప్రాయాలను శ్రద్ధగా విని, వారితో కలిసి సమస్యలకు శాశ్వత పరిష్కారాల కోసం కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, యువత, సంక్షేమ సంఘాల నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ధన్వంతరి అనుభవ వైద్య సంఘం ఆధ్వర్యంలో డాక్టర్స్ డే

**జగద్గిరిగుట్ట, జులై 1, ప్రభాతవార్త**

వైద్యుల దినోత్సవం (డాక్టర్స్ డే) ను పురస్కరించుకొని జగద్గిరిగుట్ట ధన్వంతరి అనుభవ వైద్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జగద్గిరిగుట్టలోని కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు కార్పొరేటర్ చేతుల మీదుగా కేక్ కట్ చేపించి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం కార్పొరేటర్ జగన్ మాట్లాడుతూ సమాజంలో వైద్య వృత్తి ఎంతో ఉన్నతమైనదన్నారు. వైద్యులను దేవునితో సమానంగా చూడడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. ముఖ్యంగా ప్రజలకు ఎల్లవేళలా పేద ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్న ఆర్.ఎం.పి ,పి.ఎం.పి డాక్టర్ల కు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శ్రీనివాసరాజు, కుత్బుల్లాపూర్, అధ్యక్షులు విష్ణువర్ధన్, రవికుమార్ నిరంజన్ రెడ్డి, రాము.శోభన్ బాబు, నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రోడ్డంతా గుంతలమయం.. ప్రయాణం నరకప్రాయం



గుంతల మాయంతో అద్వాన్నంగా ఉన్న రోడ్డు

**మాధాపూర్, జులై 1 ప్రభాతవార్త**

హైటెక్ సిటీ మెయిన్ రోడ్డు నుంచి చంద్ర నాయక్ తండా మీదగా పర్వతనగర్ వెళ్లే రోడ్డు గుంతల మాయంతో అద్వాన్నంగా ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. వాహనముల నుండి కింద పడి కాళ్లు, చేతులు విరిగి పోయిన సంఘటనలు ఉన్నాయి. మెయిన్ రోడ్డు కావటంతో ఉదయం ఆఫీస్ పోయేవారితో, సాయంత్రం ఆఫీసు ముగించుకుని వచ్చేవారితో. లోకల్ పబ్లిక్‌తో కిలోమీటర్ దూరం ట్రాఫిక్ జామ్‌తో అనేక ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే కొత్త రోడ్డు లేక మరమత్తులు చేసి ప్రజల ప్రాణాలు కాపాడావలసిందిగా బీఆర్ఎస్ పార్టీ మాదాపూర్ డివిజన్ గౌరవ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నాయకులు భిక్షపతి ముదిరాజ్, తండా వాసులు కోరారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు : తహసీల్దార్ సయ్యద్ మతీన్

### పలు అక్రమ నిర్మాణాల కూల్చివేత



భౌరంపేటలో అక్రమ నిర్మాణాలు తొలగిస్తున్న దృశ్యం

**దుండిగల్, జులై 1 ప్రభాతవార్త:** నిబంధనలు ఉల్లంఘిస్తూ ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని గండిమైసమ్మదుండిగల్ మండలం తహసీల్దార్ సయ్యద్ మతీన్ స్పష్టం చేశారు. మండల పరిధిలోని పలు చోట్ల అక్రమ నిర్మాణాలు చోటు చేసుకుంటున్నట్లు స్థానికుల నుండి ఆయనకు ఫిర్యాదులు అందడంతో సదరు ప్రాంతాలను పరిశీలించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలంటూ గిర్దావర్లను ఆదేశించారు. ఈమేరకు గిర్దావర్ రవికుమార్ గాగిల్లాపూర్ సర్వే నంబర్ 139భూదాన్ స్థలంలో వెలసిన బేస్‌మెంట్లు, ప్రహరిని, భౌరంపేట సర్వేనంబర్ 576లో రెండు గదులను, డి.పి.పల్లి సర్వేనంబర్ 120లో ఒక గదిని జెసిబి సహాయంతో కూల్చివేశారు. గిర్దావర్ రజనీకాంత్ బహదూర్‌పల్లి సర్వేనంబర్ 227లో ఒక ఇంటి స్లాబ్‌ను బ్రేకర్ సహాయంతో పగులగొట్టారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవన్నారు. కూల్చివేతలు కొనసాగుతాయని పేర్కొన్నారు. అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## నల్ల చెరువును అభివృద్ధి చేసి వినియోగంలోకి తేవడమే ప్రభుత్వ లక్ష్యం : బండి రమేష్



నల్లచెరువులో జరుగుతున్న సుందరీకరణపనులను పరిశీలిస్తున్న బండి రమేష్

**కెపిహెచ్బి కాలనీ, జూన్ 1, ప్రభాతవార్త**

పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కోట్ల రూపాయలతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ పేర్కొన్నారు. పేద ప్రజలకు నష్టం కలిగించే ఎలాంటి చర్యలను ప్రభుత్వం తీసుకోదన్నారు. కూకట్పల్లిలో ఉన్న నల్లచెరువులో కోట్ల రూపాయలతో ప్రభుత్వం ఇటీవల సుందరీ కరణపనులను చేపట్టింది. ఇక్కడ జరుగుతున్న పనుల తీరును రమేష్ స్థానిక నాయకులతో కలిసి మంగళవారం ఉద యం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్ల చెరువును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం జరుగుతుందని వాకింగ్ ట్రాక్ జాగింగ్ ట్రాక్ గ్రీనరీ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. గతంలో ఇక్కడ ఉన్న నాయకులు చెరువులు నాళాలు, ఎఫ్‌టిఎల్ ప్రాంతాలను దొంగ డాక్యుమెంట్లు సృష్టించి కబ్జా చేసి అమ్ముకొని సొమ్ము చేసుకున్నారని ఆయన ధ్వజమెత్తారు. దాదాపు 33 ఎకరాలు ఉన్న ఈ చెరువు ప్రస్తుతం చాలా వరకు కబ్జాకు గురైంది అన్నారు. భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని ఉన్న చెరువునైనా కాపాడాలని ఉద్దేశంతో ఈ పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఎఫ్‌టిఎల్ పరిధిలో ఎవరికైనా నిజంగా డాక్యుమెంట్స్ ఉంటే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. హైడ్రా కమిషనర్ గతంలో చెరువును పరిశీలించి కబ్జాకు గురైనట్లు ధ్రువీకరించారు. నియోజకవర్గ పరిధిలోని చెరువులను ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటుంది అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు, అన్ని విభాగాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

## బాలానగర్ ఫ్లైఓవర్‌పై పోలీసులను ఢీకొట్టిన డిసిఎం

### - తీవ్రంగా గాయపడిన ఎస్ఐ

**హైదరాబాద్, జులై 1 ప్రభాతవార్త**

బాలానగర్ ఫ్లైఓవర్ పై ఓ గుర్తు తెలియని పాదచారుడని కారు ఢీ కొట్టిన ఘటనలో వ్యక్తి మృతి చెందారు .ఫ్లైఓవర్‌పై నడిచి వెళ్తున్న వ్యక్తిని అతి వేగంగా వచ్చిన వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.ప్రమాద ఘటనను పంచనామా చేయడానికి ప్రమాద స్థలికి చేరుకున్న పోలీసులను ఆదే సమయంలో వేగంగా వచ్చిన డీసీఎం వ్యాను పోలీసులను ఢీకొట్టింది. ప్రొబేషనరీ సబ్ ఇన్‌స్పెక్టర్ (శిక్షణలో ఉన్న ఎస్ఐ) ఎస్. వెంకటేశం ఈ దుర్ఘటనలో ఎస్ఐ రెండు కాళ్లు విరిగిపోయాయి. అతడిని చికిత్స నిమిత్తం నగరంలోని యశోద దవాఖానకు తరలించారు. బాలానగర్ పోలీసులు, స్థానికులు కలిపిన వివరాల ప్రకారం మంగళవారం తెల్లవారుజామున 3.10 గంటలకు గుర్తు తెలియని వ్యక్తి బాలానగర్ ఫ్లైఓవర్ నుంచి కూకట్‌పల్లి వైపు నడుచుకుంటూ వెళ్తున్నాడు. బోయిన్‌పల్లి వైపు నుంచి వచ్చిన కారు (టిఎస్ 08యుఇ 1029) పాదాచారూడిని ఢీకొట్టింది. ఈ సంఘటనలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని ప్రయాణికులు బాలానగర్ పోలీసులకు సమాచారం అందించారు.

**ప్రొబేషనరీ ఎస్ఐని ఢీకొట్టిన డీసీఎం..**

బాలానగర్ ఫ్లైఓవర్ పై జరిగిన ప్రమాదం సంఘటనను పంచనామా చేసేందుకు ప్రొబేషనరీ ఎస్ఐ ఎస్ వెంకటేశం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. విధి నిర్వహణలో ఉన్న ప్రొబేషనరీ ఎస్ఐ వెంకటేశంను బోయిన్‌పల్లి వైపు నుంచి వేగంగా దూసుకువచ్చిన డీసీఎం (టిఎస్ 12 యుడి3937) అతని ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడి రెండు కాళ్లు విరిగిపోయాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం నగరంలోని మాదాపూర్ యశోద ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ప్రొఫెషనల్ ఎస్సై వెంకటేష్ను బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్, ఏసిపి నరేష్ రెడ్డి, బాలానగర్ సీఐ నరసింహారాజులు పరామర్శించారు.

**ప్రొఫెషనరీ ముగిసింది..**

**పోస్టింగ్ వచ్చే సమయానికి ప్రమాదం..**

బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో ప్రొబేషనరీ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఎస్ వెంకటేశంకు జూన్ 30తో ఆరు నెలల ప్రొబేషనరీ కాలపరిమతి ముగిసింది. జులై నెలలో పోస్టింగ్ రానున్న నేపథ్యంలో ఈ ప్రమాదం సంభవించింది. అతడి పై ఎన్నో ఆశలు పెట్టుకొని వెంకటేశం కుటుంబ సభ్యులకు నిరాశ వచ్చి పడింది. ఇదిలా ఉండగా చికిత్సలో ఉన్న వెంకటేశంకు పోలీస్ ఉన్నతాధికారులు పోస్టింగ్ ఇస్తారా వెయిటింగ్ లో పెడతారా వేచి చూడాల్సిందే.

## ఘనంగా "వైద్యరత్న" అవార్డుల ప్రదానోత్సవం



జ్యోతిని వెలిగిస్తున్న శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనా చారి

**చిక్కడపల్లి, జూలై 1 ప్రభాతవార్త:** వైద్యుదంటే దేవుడితో సమానమని తెలంగాణ రాష్ట్ర శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనా చారి పేర్కొన్నారు. మంగళవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో ఎస్.ఆర్.ఆర్.చారిటబుల్ ట్రస్ట్ మరియు పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రముఖ వైద్యులకు వైద్యరత్న అవార్డు ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా ముఖ్య అతిథులు సిరికొండ మధుసూదనా చారి, డాక్టర్ గూడూరు సీతా మహాలక్ష్మి మాట్లాడారు.. ముందుగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం "వైద్య రత్న" అవార్డు గ్రహీతలు డాక్టర్ జె.ప్రదీప్ కుమార్, డాక్టర్ షరీఫ్ ఖాన్ షా, డాక్టర్ కొండపల్లి అపర్ణ, డాక్టర్ నవీన్ సింగ్ ఠాకూర్ లను మొమెంటో, శాలువా, పూల మాల, కిరీట దారణతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో లయన్ డాక్టర్ ఎస్.పి. భారతి, విశ్రాంత డిప్యూటి రిజిస్ట్రార్ ఎన్.వేణుగోపాల శర్మ, లాయర్ డాక్టర్ ఆమంచ అంజయ్య, రచయిత్రి డాక్టర్ రాధ కుసుమ, నిర్వాహకులు లయన్ డాక్టర్ ఎస్.రామచంద్ర రావు, కె.మురళీ మోహన్ రాజు, డాక్టర్ బి.గంగాధర్ రెడ్డి, వి.వి. మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పాతబస్తీ సౌత్ సర్కిల్‌లో విద్యుత్ భద్రతా వారోత్సవాలు



విద్యుత్ భద్రతా వారోత్సవాలలో పాల్గొన్న ఎస్ఈ సోమిరెడ్డి,చార్మినార్ డిఈ ఎం.శ్రీ ధర్, ఏడిఈ మక్సూద్ అహ్మద్ తదితరులు

**చార్మినార్,జూలై 1 ప్రభాతవార్త :** దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం చార్మినార్ ఏడిఈ కార్యాలయం ఆవరణలో విద్యుత్ భద్రతా వారోత్సవాలు జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన సౌత్ సర్కిల్ ఎస్ఈ సోమిరెడ్డి మాట్లాడుతూ విధి నిర్వాహణలో ఉద్యోగులు,సిబ్బంది చాలా జాగ్రత్తగా ఉండాలని,భద్రతా పరికారాలను తప్పకుండ వాడాలని విజ్ఞప్తి చేశారు.విద్యుత్ స్తంభాలు మీద పని చేసే సమయంలో ఉద్యోగులు సేఫ్టీ బెల్ట్,చేతులకు రబ్బర్ తొడుగులు ధరించాలని ఆయన తెలిపారు.విద్యుత్ లైన్ మీద పని చేసే ముందు లైన్ క్లియర్‌ను నిర్ధారణ చేసుకోవాలని,సబ్‌స్టేషన్ ఆవరణలోకి గొడుగు వేసుకుని ఎక్కరాదని తప్పకుండ హెల్మెట్ ధరించాలని ఆయన తెలియజేశారు.విద్యుత్ ఉద్యోగులు,సిబ్బందికి ఎస్ఈ సోమిరెడ్డి,చార్మినార్ డిఈ శ్రీ ధర్,ఏడిఈ మక్సూద్ అహ్మద్,లు కలిసి హెల్మెట్లు,ఎర్త్‌రాడ్లుతో పాటు భద్రతకు సంబంధించిన పలు సేఫ్టీ వస్తులను అందజేశారు.ఈ కార్యక్రమంలో చార్మినార్ ఏఈ మహమూద్, హుస్సేనీఆలం ఏఈ రాములతో పాటు చార్మినార్ ,మొగల్‌పుర,హుస్సేనీఆలం విద్యుత్ కార్యాలయాల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## డెంటల్ సర్జన్లకే హెయిర్‌ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసే అర్హత

### - తెలంగాణ డెంటల్ కౌన్సిల్ వెల్లడి

**హైదరాబాద్,జూలై 1,ప్రభాతవార్త:**

ఫేషియల్ సహ ఇతర సౌందర్య ప్రక్రియలు, హెయిర్ ట్రాన్స్ ప్లాంషన్ చేయటానికి ఓరల్, మాక్సిలోఫేషియల్ సర్జన్లకు మాత్రమే ఉందని, ఇతరులకు దీన్ని చేసే అర్హత లేదని తెలంగాణ డెంటల్ కౌన్సిల్ స్పష్టం చేసింది. మాస్టర్ ఆఫ్ డెంటల్ సర్జరీ (ఎండిఎస్) కోర్సు రెగ్యులేషన్స్ (మూడో సవరణ)కు డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చేసిన సవరణల ఆధారంగా డెంటల్ సర్జన్‌లకు మాత్రమే హెయిర్ ట్రాన్స్ ప్లాంషన్, ఫేషియల్ తదితర ప్రక్రియల్ చేసే అవకాశం ఉంటుందని కౌన్సిల్ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఓరల్, మాక్సిలోఫేషియల్ సర్జన్లు అనేక రకాలైన ప్రక్రియలకు నిర్వహించడానికి శిక్షణ పొందుతారని వివరించింది. మైనర్ ఓరల్ సర్జరీలు, సాఫ్ట్ టిష్యూ గాయాలు, పగుళ్లు, తుపాకీ గాయాలు, యుద్ధ గాయాలు, తల, మెడ తది తర ప్రాంతంలోని క్యాన్సర్ల కు చేసే శస్త్ర చికిత్స తదితర అంశాలు వీటిలో ఉంటాయన్నారు. ఈ నేపథ్యంలో డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రమాణాల ప్రకారం శిక్షణ పొందిన, సరిగ్గా నమోదు చేసుకున్న ఓరల్, మాక్సి లోఫేషియల్ సర్జన్లు ముఖ సౌందర్య ప్రక్రియలు, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను నిర్వహించడానికి పూర్తగి అర్హులని తెలంగాణ డెంటల్ కౌన్సిల్ పేర్కొంది. ఈవిషయంలో డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, రాష్ట్ర డెంటల్ కౌన్సిల్ మినహా ఇతర సంస్థలు, కౌన్సిల్ నుంచి వచ్చే ప్రకటనలను నమ్మి ప్రజలను తప్పుదోవ పట్టొద్దని ప్రజలకు కౌన్సిల్ సూచించింది.

## భారతీయ నృత్య కళలతో మానసిక వికాసం పుష్కలం : మధుసూదన్ రావు



నృత్యకళాకారులను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, జూలై 1 ప్రభాతవార్త:** తెలుగువారి సాంప్రదాయ కళలు ఆధ్యాత్మిక సౌరభాలతో అలరారుతూ సమాజాన్ని చైతన్యవంతం చేస్తున్నాయని దూరదర్శన్ పూర్వ సంచాలకులు పాలకుర్తి మధుసూదన్ రావు పేర్కొన్నారు. మంగళవారం నల్లకుంట శృంగేరి శంకర మఠం సౌజన్యంతో ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ అధినేత పాలపర్తి సంధ్యారాణి నిర్వహణలో సాంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం శంకర మఠం ప్రాంగణంలో జరిగింది. పాలకుర్తి మధుసూదన్ రావు మాట్లాడుతూ తరాలు మారుతున్న సంధి కాలంలో, మన సాంప్రదాయ బద్ధమైన నృత్య కళలు పరంపరగా కొనసాగాల్సిన అవసరం చాలా ఉందని ,తద్వారా మన సంస్కృతి వైభవోపేతంగా విరాజుల్లుతుందని ,అందుకు కారకులైన గురువులు, తల్లిదండ్రులు అభినందనీయులని అన్నారు. నృత్య గురువు శ్రీమతి విశాఖ ప్రకాష్ శిష్యులు లితిక, వేదశ్రీ, శ్రీహిత, కార్తీక,భావజ్ఞ, హరిత, గీతి ప్రదర్శించిన గణపతి తాళం, శ్రీ లలిత నక్షత్ర మాలి పుష్పాంజలి నట రాగం, అన్నమాచార్య కృతి,రామచంద్రుడు ఇతడు రఘువీరుడు పలు భరతనాట్య నృత్యాంశాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. యువకళావాహిని అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ, సంగీత గురువు రత్నమాల, పాలపర్తి సంధ్యారాణి, నృత్య గురువు విశాఖ ప్రకాష్ ప్రసంగించారు. బుర్ర మోహన్ కృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించగా ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు పాలపర్తి సంధ్యారాణి సంస్థ కన్వీనర్ రఘుశ్రీ సభసమన్వయం గావించారు.

## రేణుక ఎల్లమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే



అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ

**అల్వాల్, జూలై 1 ప్రభాతవార్త:**

అల్వాల్ మంచినీటి రిజర్వాయర్ వద్ద కొలువు తీరి ఉన్న రేణుక ఎల్లమ్మను మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి దర్శించుకున్నారు. ఎమ్మెల్యేతో పాటుగా అల్వాల్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి ఇతరులు కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. అమ్మవారి కళ్యాణోత్సవం ప్రతి ఏడాది ఇక్కడ ఘనంగా నిర్వహించడం జరుగుతుంది.

## శక్తి గణేష్ నగర్‌లో పర్యటించిన కార్పొరేటర్



కాలనీ వాసులుతో కార్పొరేటర్ జితేందర్‌నాథ్

**అల్వాల్, జూలై 1 ప్రభాతవార్త:**

మచ్చబొల్లారం కార్పొరేటర్ జితేందర్‌నాథ్ శక్తి గణేష్ నగర్‌లో పర్యటించారు. కాలనీలోని సింహం వారాహి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలులో పాల్గొన్నారు. అనంతరం కాలనీలోని పర్యటించిన జితేందర్‌నాథ్ పారిశుధ్యం, అంతర్గత రోడ్లు తదితర సమస్యలను సంబంధించి ఆయా శాఖల అధికారులుతో కార్పొరేటర్ చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎఇ రవళి, శానిటరీ సూపర్ వైజర్ ప్రభాకర్, ఎలక్ట్రికల్ ఎఇ శ్రవంతి ఇతరులు పాల్గొన్నారు.

## తెలుగు భాషపై నిర్లక్ష్యం వీడాలి : సాయిబాబా

**ముషీరాబాద్, జూలై 1, ప్రభాతవార్త:** గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలుగు భాషపై చూపిన నిర్లక్ష్యాన్నే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగిస్తోందని, తెలుగభాషపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం భారతీయ భాషలను ప్రోత్సహించేందుకు కొంత నిధులను కేటాయిస్తుందని, 2014 నుండి 2025 వరకు వివిధ భాషలపై ఎంత ఖర్చు చేసింది ఆర్టీఐ వెల్లడించిందని తెలిపారు. ఆర్టీఐ వెల్లడించిన వివరాల ప్రకారం సంస్కృత భాష కోసం 2,532 కోట్లు ఖర్చు చేశారని, ఉర్దూ కోసం 838 కోట్లు, హిందీ కోసం 426 కోట్లు, తమిళం కోసం 120 కోట్లు సింధీపై 54 కోట్లు ఖర్చు చేస్తే తెలుగు భాషపై కేవలం 12.65 కోట్లు ఖర్చు చేశారని గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తెలుగును అధికార భాషగా గుర్తించి, తెలుగు భాషకు అత్యధిక ప్రాధాన్యతను ఇచ్చారని, అటువంటి తెలుగు భాషను నిర్వీర్యం చేసే కుట్రలు ప్రయత్నాలు జరగటం విచారకరమన్నారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని కించ పరిచే విధంగా తెలగుకు 12 కోట్లు కేటాయించటం దురదృష్టకరమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ విషయంపై స్పందించి, కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసి, తెలుగు భాషకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## రాందేవ్ ఆసుపత్రిలో డాక్టర్స్ డే వేడుకలు



వైద్యులను సత్కరిస్తున్న దృశ్యం

**కెపిహెచ్బి కాలనీ, జూన్ 1, ప్రభాతవార్త**

తల్లి దండ్రులు జన్మనిస్తే వైద్యులు పునర్జన్మనిస్తారనీ, వైద్యులు తమ ప్రాణం పోతుందని తెలిసి కూడా తమ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా రోగుల కొరకు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి వైద్యం చేస్తారనీ రాందేవ్ ఆసుపత్రి డాక్టర్లు పేర్కొన్నారు. మంగళవారం కూకట్పల్లిలోని రాందేవ్ ఆసుపత్రిలో డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్లు మాట్లాడుతూ వైద్యణ్ణి వైద్యో నారాయనో హరి అంటారనీ వైద్యం ఒక వృత్తిగా కాకుండా ప్రాణాలను కాపాడే ఒక మహోన్నత శక్తి గా వైద్యాన్ని అభివర్ణిస్తుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాందేవ్రావు ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ కమలాకర్, ప్రముఖ స్త్రీ నిపుణురాలు ఛాయాదేవి, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సంస్కృతి ప్రెసిడెంట్ లయన్ సుష్మ, సుజాత సూర్యారాజు, ఆదరణ ఫౌండేషన్ ఆరిగెల రఘునాథ్ బాబు, జగన్ ఎర్రవెల్లి, పెరి ప్రసాద్, తెల్ల హరికృష్ణ, నరేంద్ర పాల్గొని వైద్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

### హిమాయత్ సాగర్‌లో దూకి యువకుడు ఆత్మహత్య

**అత్తాపూర్ జూలై1, ప్రభాతవార్త :** హిమాయత్ సాగర్ యువకుడు దూకి ఆత్మహత్య చేసుకున్న విషాదకర ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై కిషోర్ వివరాల ప్రకారం... బండ్లగూడ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ సాగర్‌కు చెందిన ముఖేష్ (32) పని చేయకుండా ఖాళీగా ఉంటున్నాడు.తరచూ ఏటిఎం సెంటర్ల వద్ద మాటువేసి అమాయకుల నుంచి డబ్బులు తీసుకుంటాడు.ఈ క్రమంలో ఇటీవల రూ.75వేల తీసుకున్నాడు.ముఖేష్ దొంగతనాలు చేయడంతో కానిస్టేబుల్ అయిన అతని భార్య కొంతకాలంగా విడిగా ఉంటుంది.కొన్ని రోజుల క్రితం ముఖేష్‌ను స్నేహితులు కూడా దూరం పెట్టడంతో మనస్తాపానికి గురయ్యాడు.దీంతో హిమాయత్ సాగర్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### కూకట్‌పల్లిలో ఎస్‌బిఐ బ్యాంకు 70 వసంతాల వేడుకలు



ఎస్‌బిఐ బ్యాంకు 70 వసంతాల వేడుకల్లో పాల్గొన్న ఎర్రబెల్లి సతీష్ రావు

**కెపిహెచ్బి కాలనీ, జూన్ 1, ప్రభాతవార్త**

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ వారు బ్యాంకింగ్ సేవలు 1955వ సంవత్సరంలో ప్రారంభించి నేటికీ 70 సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం పిబిబి కూకట్‌పల్లి బ్రాంచ్‌లో మేనేజర్ పీ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో 70 వసంతాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బి.ఆర్.ఎస్ పార్టీ శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్‌కి సిబ్బందికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

### వైద్యులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కృష్ణారావు...



వైద్యురాలిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

**కెపిహెచ్బి కాలనీ, జూన్ 1, ప్రభాతవార్త**

వైద్యుల దినోత్సవం సందర్భంగా కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన వైద్యులను మంగళవారం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు దైవంతో సమానమని సమాజంలో వైద్యులకు ఉండే గౌరవం ఈ పుడమి ఉన్నంతవరకు మొదటి స్థానంలోనే ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ ఓ డా.శోభ రాజ్, డా.మోనిక, డా.వెంకట్రావు తదితర వైద్యులు పాల్గొన్నారు.

### విద్యార్థులలో పర్యావరణ పట్ల ప్రేమను పెంచటానికై గ్రీన్ ఇండియా మిషన్ : ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**ముషీరాబాద్, జూలై 1, ప్రభాతవార్త:** విద్యార్థులలో పర్యావరణ పట్ల ప్రేమను పెంచటానికి గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమం ఎంతగానో తోడ్పడుతుందని అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. మంగళవారం గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమం సందర్భంగా బర్కత్‌పురాలో శ్రీచైతన్య పాఠశాలలో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో ముఖ్యమన్నారు. పర్యావరణ విశిష్టత గురించి, దాని ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రుబీనా, ఏజీఎం మొగల్నార్ మహ్మద్ అలీ, ఆర్ఐ మల్లిఖార్జున్ నాయుడు, కోఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్, ధర్మేందర్ మరియు ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### హాష్ ఆయిల్, గంజాయి విక్రయిస్తున్న నిందితులు అరెస్టు



**పేట్ బషీరాబాద్, జులై 1, ప్రభాతవార్త**

హష్ ఆయిల్, గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందుతులను పోలీసులు అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తలరించారు. మేడ్చల్ ఇన్స్‌పెక్టర్ నవనీత తెలిపిని వివరాల ప్రకారం మంగళవారం ఉదయం మేడ్చల్ చెక్ పోస్ట్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. వారి వద్ద నుండి 255 గ్రాముల హష్ ఆయిల్, 475 గ్రాముల ఎండు గంజాయి, 4 మొబైల్ ఫోన్లు, 2 ద్విచక్ర వాహనాలు స్వాధీన చేసుకుని, వారిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరిలిస్తున్నట్లు తెలిపారు. నిందితులు బాలానగర్‌కు చెందిన జనం మహేష్ బాబు, మచ్చ బొల్లారుకి చెందిన బద్నాపురం నరేందర్, కూకట్‌పల్లికి చెందిన క్రిస్టో పి. ఫిలిప్, యాప్రాల్‌కు చెందిన పి. షాజి జార్జిలు గుర్తు తెలియని వ్యక్తి వద్ద నుండి హష్ అయిల్, ఎండు గంజాయి కొనుగోలు చేశారు. దానిని హైదరాబాద్‌లోని మేడ్చల్, కొంపల్లి పరిసర ప్రాంతాలలో శ్రామికులకు, విద్యార్థులకు ఎక్కువ ధరకు అమ్మి లాభాలు గడిస్తున్నట్లు తెలిపారు.



నెహ్రూనగర్ వార్డ్ కార్యాలయంలో జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులకు ఏఎంహెచ్ఓ హేమలతతో కలిసి భద్రతా వస్తు సామగ్రిని అందచేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

## మహంకాళి దేవాలయంలో ఘనంగా ఎల్లమ్మ కళ్యాణం



దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కొమిరెల్లి రాజశేఖర్ రెడ్డి, చౌకి రవికుమార్ తదితరులు

**మలక్ పేట ,జూలై 1, ప్రభాతవార్త:** ఓల్డ్ మలక్ పేట్ లోని చింత చెట్టు మహంకాళి దేవాలయంలో ఎల్లమ్మ కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఎల్లమ్మ కళ్యాణం లో పోచమ్మ టెంపుల్ ప్రతినిధి కొమిరెల్లి రాజశేఖర్ రెడ్డి, ఉత్సవాల కమిటీ చైర్మన్ చౌకి రవికుమార్, మలక్ పేట్ సేవాదళ్ ప్రెసిడెంట్ ఆకుల రాజు, పిటి శంకర్ ముదిరాజ్ ,తులసి సురేష్ కుమార్, ఉపేందర్,, శైలజ అశోక్ ,జయమ్మ శ్రీనివాస్ విజయకుమార్ ముప్పిడి శ్రీనివాస్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులందరికీ అన్న ప్రసాదం నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు ,స్థానిక భక్తులు దేవాలయానికి విచ్చేసి పూజలు నిర్వహించారు.

## సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



**మల్కాజిగిరి జూలై1,ప్రభాతవార్త :**
మల్కాజ్గిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మోలాలి డివిజన్ కు చెందిన బి ఆర్ ఎస్ నాయకులు వంశీ ముదిరాజ్, ఉస్మాన్ ఆధ్వర్యంలో చందాబాగ్ , పివిఆర్ ప్లాజా, మనోరత్నం అపార్ట్మెంట్ కు సంబంధించిన పలు సమస్యలు. రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని సిసి రోడ్లు వేయించాలని, డ్రైనేజీ పైపులైను వేయించాలని, త్రాగునీరు కనెక్షను ఇప్పించాలని, ఎమ్మెల్యే కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేశారు. ఈ యొక్క కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు ఉస్మాన్ వంశీ ముదిరాజ్, మారుతి ప్రసాద్ , స్వామి దుర్గేష్, శ్రీధర్, షేక్ అల్లా భాష, తదితరులు పాల్గొన్నారు.

## భవానీ ఎన్ క్లేవ్ నూతన కమిటీ ఏర్పాటు

**వనస్థలిపురం జూలై.1.ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని భవానీ ఎన్ క్లేవ్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నికైనది. అధ్యక్షుడు గా పి.ప్రశాంత్ గౌడ్,ఉపాధ్యక్షులు గా శ్రీనివాస్,టి. గాయత్రీ జైపాల్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి గా రమేష్ రెడ్డి,కోశాధికారి గా ఎన్. ఎం. బి.చారి, జాయింట్ సెక్రటరీలు గా కే. నరసింహ, కే. స్పందన లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రశాంత్ గౌడ్ మాట్లాడుతూ తమపై నమ్మకం తో గెలిపించిన కాలనీ వాసులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారం తో కాలనీలో నెలకొన్న సమస్యల పరిస్కారానికి కృషి చేస్తామన్నారు.

## పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి : కలెక్టర్



ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ నారాయణ రెడ్డి

**వనస్థలిపురం. జూలై.1.ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి కోరారు. మంగళవారం వనస్థలిపురం లోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అన్ని విభాగాల ను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు.మెడికల్ కళాశాల కు సంభందించి గదులు సరిపోవడం లేదని,సి.టి. స్కాన్,బ్లడ్ బ్యాంక్ లను ఏర్పాటు చేయంలంటే ఇక్కడ ఉన్న వెల్ నెస్ సెంటర్ ను సమీపంలోని మోడల్ మార్కెట్ భవనంలోకి మార్చాలని సూచించారు. అందుకు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు యాదయ్య,నీలిమ, నాగేందర్, జయమాల,ప్రిన్సి పాల్ త్రివే ణి, డియం ఈ.వాణి,హయత్నగర్ తహసీల్దార్ జానకి పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులలో నాణ్యత పాటించాలి : కార్పొరేటర్



ఎస్కే. డి.నగర్ లో డ్రైనేజీ పైప్ లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం జూలై.1.ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ కృష్ణదేవరాయ నగర్ లో డ్రైనేజీ పైపులైన్ నిర్మాణపు పనులను స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి జల మండలి మేనేజర్ సిరివెన్నెల తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఏ సమస్య వచ్చినా ప్రజలకు అందుబాటులో ఉండి, సమస్యల పరిస్కారానికి కృషి చేస్తానన్నారు.

## మహంకాళి జాతర సన్నాహక పనులు ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న చైర్మన్ సుభాష్ చందర్జీ, కమిటి సభ్యులు

**సైదాబాద్, జూలై 1 ప్రభాతవార్త:** శ్రద్ధాబాద్ మార్కెట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహంకాళి జాతర మహోత్సవ సన్నాహక పనుల్లో భాగంగా కమిటీ సభ్యులు అమ్మవారిని ప్రతిష్టించి పూజలు నిర్వహించారు. శ్రద్ధాబాద్ మహంకాళి జాతర మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ సుభాష్ చందర్జీ, మాజీ కార్పొరేటర్ కూసూరు సహదేవ్ యాదవ్, సభ్యులు మల్లేష్, కదారి రామ్ కుమార్, కోళ్ల గోపి తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థలలో వికలాంగులకు ప్రాతినిధ్యం కల్పించాలి : మహమ్మద్ షఫీ



మంత్రి అడ్లూరి డ్లూరి లక్ష్మణ్ కుమార్ కు వినతిపత్రం సమర్పిస్తున్న మహమ్మద్ షఫీ, మల్లికార్జున్, యాదగిరి తదితరులు

**మలక్ పేట ,జూలై 1, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల్లో వికలాంగులకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ వికలాంగుల ప్రాతినిధ్య సాధన కమిటీ చైర్మన్ మొహమ్మద్ షఫీ అహ్మద్ ఖాన్ , వైస్ చైర్మన్ దైనంపల్లి మల్లికార్జున్, ప్రధానకార్యదర్శి బెస్తా యాదగిరి, శబరిచావ్ల, శ్రీకాంత్‌రెడ్డి, మదుసుధన్, భాస్కర చారీ,గణేష్ తదితరుల ప్రతినిధుల బృందం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను ఈరోజు మినిష్టర్ క్వాటర్స్‌లో కలసి స్థానిక సంస్థలలో వికలాంగుల ప్రాతినిధ్యం కల్పించడం గురించి చర్చించి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ మొహమ్మద్ షఫీ అహ్మద్ ఖాన్ , వైస్ చైర్మన్ దైనంపల్లి మల్లికార్జున్ లు మాట్లాడుతూ 2024లో ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ (తి॥దిది) విడుదల చేసిన మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రకారం వికలాంగులకు స్థానిక సంస్థలలో నామినేషన్ ద్వారా రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే హామీని అమలు చేయాలని మంత్రిని కోరినట్టు తెలిపారు. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్తులు, జిల్లా పరిషత్తులు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో ఇద్దరేసి వికలాంగులను (వీరిలో ఒకరు మహిళ) ప్రభుత్వం నామినేట్ చేయడంవల్ల ప్రభుత్వానికి ఏలాంటి ఆర్థికభారం పడదని మంత్రి దృష్టికి తీసుకెళ్ళామని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో అమలును ఆదర్శంగా తీసుకోవాలని , 2021వ సంవత్సరంలో రాజస్థాన్ రాష్ట్రం స్థానిక సంస్థల్లో వికలాంగులకు ప్రాతినిధ్యం కల్పిస్తూ పంచాయతీరాజ్ చట్ట సవరణ చేస్తూ అమలు చేస్తుందని, అంతేకాకుండా 2019 లో ఛత్తీస్ గడ్ రాష్ట్రం స్థానిక సంస్థల్లో వికలాంగులకు ప్రాతినిధ్యం కల్పించి న్యాయం చేసిందని అన్నారు. రెండు రాష్ట్రాలలో కూడా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే జరిగిందని మంత్రి దృష్టికి తీసుకెళ్ళినట్టు తెలిపారు. కొద్ది రోజులముందే కాంగ్రెస్ కూటమికి చెందిన డీఎంకే ప్రభుత్వం తమిళనాడు రాష్ట్రంలో పంచాయతీరాజ్ చట్ట సవరణ చేస్తూ వికలాంగులకు స్థానిక సంస్థలలో భాగస్వామ్యం కల్పించిందని తెలసారు. రానున్న స్థానిక సంస్థలకు ఎన్నికల కంటే ముందే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఇది చారిత్రక నిర్ణయంగా నిలిచే అవకాశం అని తెలిపారు."రాజకీయ ప్రాతినిధ్యం లేకుండా వికలాంగుల గొంతు వినిపించదని అందుకే ఈ హక్కును అమలు చేయాల్సి న సమయం ఇది," అని అన్నారు. రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పిస్తే కొంతమేరకైనా మా తలరాతలను మేమే మార్చు చేసుకునే దిశగా అడుగులు వేస్తామని ఆకాంక్షిస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 21 రకాల వైకల్యాలు గల, మొత్తంగా 20 లక్షల దివ్యాంగుల జనాభా కలిగి మా కుటుంబాలతో కలిపి దాదాపు కోటికి పైగా జనాభాను ప్రభావితం చేసే ఆవశ్యకత ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానూకూల నిర్ణయం తీసుకునేలా మంత్రి లక్ష్మణ్‌కుమారు కృషి చేయాలని కోరారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి స్థానిక సంస్థల లో వికలాంగులకు ప్రాతినిధ్యం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారని వివరించారు.

## రాష్ట్ర ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల నూతన భవనానికి శంకుస్థాపన

**-పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్ ,ఎమ్మెల్యే మల్లారెడ్డి రంగారెడ్డి**



**తుర్కయంజాల్ జూలై 1, ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ తెలంగాణ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల నూతన భవనానికి శంకుస్థాపన కొరకు ముఖ్యఅతిథిగా ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు మంత్రి పొన్నం ప్రభాకర్ మరియు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి , తెలంగాణ రాష్ట్ర రోడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి ,తుర్కయంజాల్ మున్సిపాలిటీ లోని మూగనూరు లో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు నూతన భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేసినారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఆర్టీసీ లో ప్రజా రవాణా వ్యవస్థలో లైఫ్ లైన్ గా ఉండి రిటైర్డ్ అయిన వారికి కమ్యూనిటీ హాల్ నిర్మిస్తున్నాం దీనికి తుర్కయంజాల్ మున్సిపాలిటీ నుండి 5 లక్షలు కేటాయించారు. జిల్లా కలెక్టర్ ద్వారా 10 లక్షలు మంజూరు చేయిస్తాం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి నుండి నిధులు కేటాయిస్తారు.. జీహెచ్ ఎంసీ జోనల్ కమిషనర్ తో మాట్లాడను ఇక్కడ ఉన్న డ్రైనేజీ నాళా సమస్య పరిష్కారం చేస్తాం ఇక్కడ రోడ్డు నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలి. అధికారంలోకి వచ్చిన 48 గంటల్లో ఆర్టీసీ లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నాం .. ఆరోగ్య శ్రీ 5 10 లక్షలకు పెంచుకున్నాం సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం.. సన్న వడ్లు బోనస్ ఇస్తున్నాం రైతులకు రైతు రుణమాఫీ పూర్తి చేశాం. 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా విడుదల చేశాం.. దేశంలో ఎక్కడ లేని విధంగా పంట పెట్టుబడి సహాయం అందించాం నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం కొత్త రేషన్ కార్డులు ఇస్తున్నాం.. కొత్త యూనిట్లు మంజూరు చేస్తున్నాం. కార్మికుల సంక్షేమానికి మా ప్రభుత్వం వ్యతిరేకం కాదు. ఆర్టీసీ ఉద్యోగుల కు పెన్షన్ లేదు.. గత 10 సంవత్సరాల్లో ఆర్టీసీ నిర్వీర్యం చేశారు. మేము కొత్త బస్సులు ,కొత్త నియామకాలు ,కొత్త బస్సు డిపోలు ఇస్తున్నాం ఆర్టీసీ లాభాల్లోకి తీసుకొస్తున్నాం ఆర్టీసీ కార్మికుల సంక్షేమం , ప్రయాణికుల భద్రత , ఆర్టీసీ పరిరక్షణ ఈ మూడింటికి ప్రాధాన్యత ఇస్తున్నాం పేదోడికి రవాణా సౌకర్యం ఆర్టీసీ..పెద్ద మొత్తంలో ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేస్తున్నాం కొత్త రూట్లలో బస్సులు నడిపిస్తున్నాం 191 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ లో ఉచితంగా ప్రయాణం చేశారు.. 6300 కోట్ల రూపాయలు విలువైన ఉచిత బస్సు ప్రయాణం చేశారు.. నేను విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పటి నుండి ఆర్టీసీ తో మంచి సంబంధం ఉండేది.. మా గురువు చొక్కరవు ఆర్టీసీ మంత్రిగా ఉండేవారు.. ఇంకో గురువు సత్యనారాయణ ఆర్టీసీ చైర్మన్ గా కూడా చేశారు రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ జీహెచ్ఎంసీ స్పెషల్ సబ్ ప్లాన్ కింద కమ్యూనిటీ హాల్ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా మేము ఆ సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్త కుర్మా మంగమ్మ శివకుమార్, మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్ పర్సన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్, మాజీ కౌన్సిలర్ బొక్క రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొక్క వంశీధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు మహిళలు పాల్గొన్నారు.

## తక్షణమే స్వర్ణకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి : వింజమూరి రాఘవాచారి



సమావేశంలో మాట్లాడుతున్న స్వర్ణకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి

**సైదాబాద్, జూలై 1 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, స్వర్ణకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ స్వర్ణకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వర్ణకారులకు పనిదొరకక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో విశ్వ బ్రాహ్మణ స్వర్ణకారుల పాత్ర గణనీయమైనదని, అయితే రాష్ట్ర సాధన అనంతరం గత పాలకులు స్వర్ణకారులను పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినప్పటికీ స్వర్ణకారుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్వర్ణకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, 50 సంవత్సరాలు నిండిన ప్రతి స్వర్ణకారుడికి పెన్షన్ ఇవ్వాలని, జిఓ నెం.272కు సవరణలు చేసి అమలు చేయాలని, పనులు దొరకక ఆత్మహత్యలకు పాల్పడుతున్న స్వర్ణకారులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని, పని దొరకక ఇబ్బందులకు గురవుతున్న వారికి పని కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించకుంటే సంఘం తరపున కార్యాచరణ ప్రకటిస్తామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వానికి తమ సత్తా చూపిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకార సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు గౌరోజు రత్నమాచారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామదాసు లక్ష్మణాచారి, రాష్ట్ర కార్యదర్శులు రాగిఫణి సతీష్ చారి, వింజమూరి వెంకటాచారి, రాష్ట్ర ప్రచార కార్యదర్శులు పుతకమూరి రమేష్ చారి, పోతులూరి చారి, పెరికేటి నాగరాజు చారి పాల్గొన్నారు.

## సోదరుల మధ్య భూ వివాదంలో ఘర్షణ - ఒకరు మృతి

**హయత్ నగర్, జూలై 1 ప్రభాతవార్త:** అన్నాతమ్ముళ్ళ మధ్య భూ వివాదం నేపథ్యంలో జరిగిన ఘర్షణలో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.... సంస్థాన్ నారాయణపురం ధాకు తాండాకు చెందిన కరంతోత్ లోఖా, కరంతోత్ రఘు, కరంతోత్ బుగ్గలు సోదరులు. వారు గత 20 సంవత్సరాలుగా బంజారా కాలనీ (అంబేద్కర్ నగర్)లో నివసిస్తున్నారు. స్వగ్రామంలో 60 గుంటల వ్యవసాయ భూమికి సంబంధించి వారి మధ్య వివాదం కొనసాగుతోంది. కొన్ని రోజుల క్రితం కరంతోత్ లోఖా తన మిగిలిన సోదరులకు తెలియకుండా తన పేరు మీద ఒక ఎకరం భూమిని రిజిస్టర్ చేసుకున్నాడు. తరువాత బుగ్గ పేరు మీద సగం భూమిని రిజిస్టర్ చేయడానికి అతను అంగీకరించాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం దీనిపై చర్చించడానికి రఘు తన సోదరుడు లోఖా ఇంటికి వెళ్ళాడు. లోఖా అక్కడ లేకపోవడంతో రఘు మరో సోదరుడు బుగ్గ ఇంటికి వెళ్ళగా, అక్కడ సోదరుల మధ్య గొడవ జరిగింది. ఈ వివాదంలో బుగ్గ, అతని కుమారుడు అనిల్ రఘుపై చేయి చేసుకోగా....అతను కుప్పకూలిపోయాడు. వెంటనే రఘును షాడో ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే అతను చనిపోయినట్లు వైద్యులు ప్రకటించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్ల మరమ్మతులకు సర్వే

**ఎల్బీనగర్, జూలై 1 ప్రభాతవార్త:**
జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో కాలనీలలో రోడ్లపై ఉన్న గుంతలకు మరమ్మత్తుల కోసం నిర్వహిస్తున్న సర్వే కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్, ఈఈ శ్రీనివాస్, ఏఈ షరీఫ్, వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి న్యూ నాగోల్ కాలనీలో రోడ్లను గుంతలను పరిశీలించారు. కొత్తపేట డివిజన్ పరిధిలో ఉన్న కాలనీలలో వర్షాకాల సమయాల్లో రోడ్లపై గుంతలు లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని, కాలనీ ప్రజలకు వాహన దారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను కార్పొరేటర్ కోరారు.

## సైదాబాద్‌లో అన్నదానం

**సైదాబాద్, జూలై 1 ప్రభాతవార్త:**
బల్కంపేట రేణుక ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణాన్ని పురస్కరించుకుని సైదాబాద్‌లోని ఫిష్ మార్కెట్ వద్ద ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కాటేకర్ సుభాష్, అవినాష్ నాయుడు, గౌలికార్ దినేష్, ధర్మేందర్ సింగ్, గౌలికార్ ఆశిష్ తదితరులు పాల్గొన్నారు.

## మీర్‌పేట్ కొత్త డిఇఇగా వేణుగోపాల్

**సరూర్‌నగర్, జూలై 1 ప్రభాతవార్త:**
మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన డిఇఇగా జి.వేణుగోపాల్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డిఇఇగా పని చేస్తూ బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిఇఇ విధులు కూడా నిర్వహిస్తున్న వెంకన్నను మీర్‌పేట్ నుండి బదిలీ చేస్తూ బడంగ్‌పేట్‌కు పూర్తి స్థాయి డిఇఇగా నియమించారు. అయితే కామారెడ్డి మున్సిపాలిటీలో డిఇఇగా పని చేస్తున్న వేణుగోపాల్‌కు మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేస్తూ పోస్టింగ్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆయన మీర్‌పేట్‌కు కొత్త డిఇఇగా బాధ్యతలు చేపట్టారు.

## వైభవంగా శ్రీ జగన్నాథ స్వామి రథయాత్ర



జగన్నాథ స్వామి రథయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

**సైదాబాద్, జూలై 1 ప్రభాతవార్త:** కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానంలోని శ్రీ జగన్నాథ స్వామి రథయాత్రను మంగళవారం కన్నుల పండువగా నిర్వహించారు. మంగళవారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, భజనల అనంతరం రథయాత్రను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి రథయాత్రలో పాల్గొన్నారు. త్రిదండి భక్తి సౌరభ్ మహరాజ్ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యనిర్వాహణాధికారి ఎన్.లావణ్య, చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, ధర్మకర్తలు ఎనుముల రవీందర్‌రెడ్డి, పూల నాగరాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రవీణ్‌గౌడ్, కిరణ్ కుమార్, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, కవిత, నరేష్, సంతోష్ కుమార్, రాజేశ్వరి, ఎక్స్ అఫీషియో సభ్యులు అంబాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీనగర్‌లో అక్రమ నిర్మాణాన్ని సీజ్ చేసిన అధికారులు




అక్రమ నిర్మాణాన్ని సీజ్ చేసిన దృశ్యం

**సైదాబాద్, జూలై 1 ప్రభాతవార్త:** లక్ష్మీనగర్ చౌరస్తాలో ఎలాంటి అనుమతులు లేకుండా చేపడుతున్న అక్రమ సెల్లార్ నిర్మాణాన్ని అధికారులు మంగళవారం సీజ్ చేశారు. అనుమతికి విరుద్ధంగా సెల్లార్ నిర్మాణాన్ని చేపడుతుండడంతో స్థానికుల ఫిర్యాదుతో గతంలో కూడా అధికారులు నోటీసులు జారీ చేసి సెల్లార్ నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన సెంట్రింగ్‌ను కూల్చివేశారు. అయితే కొద్ది రోజల క్రితం సెల్లార్ స్లాబును వేయడంతో మరోసారి స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అక్రమ సెల్లార్ నిర్మాణంపై అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తడంతో మంగళవారం సదరు అక్రమ నిర్మాణాన్ని జిహెచ్‌ఎంసి 1955 యాక్ట్ 461 ఎ కింద అధికారులు సీజ్ చేశారు.

## ఘనంగా వారాహి నవరాత్రులు



భక్తులకు ప్రసాదం అందజేస్తున్న స్వామీజీ

**ఎల్బీనగర్, జూలై 1 ప్రభాతవార్త:** ఆర్కేపురంలోని కుర్తాళం శ్రీసిద్దేశ్వరి పీఠ విభాగ ఆదిపరాశక్తి శ్రీప్రత్యంగిరా పరమేశ్వరి దేవాలయంలో వారాహి నవరాత్రులు శ్రీసిద్దేశ్వరి పీఠ ఉత్తర పీఠాధిపతులు శ్రీదత్తేశ్వరానంద భారతి మహా స్వామి వారి సమక్షంలో ఘనంగా జరుగుతున్నాయి. ప్రతిరోజు వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆలయ సెక్రెటరీ మునిపల్లె శ్రీనివాస్ మాట్లాడుతూ... అమ్మవారికి ప్రతి రోజు విశేష 18 రకాల ద్రవ్యాలతో అభిషేకము, మహిళలతో కుంకుమార్చన పారాయణలో మహా నక్షత్ర హారతులు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయని తెలిపారు. శ్రీ స్వామివారు, అమ్మవారికి విశేష అర్చనలు జరుగుతున్నాయన్నారు. ఉత్సవాలలో పాల్గొన్న భక్తులకు స్వామీజీ ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిపల్లె సువర్ణలత, నిఖిల్ శర్మ, హేమంత్‌శర్మ, రామకృష్ణ, అరుణ, హేమ, సాయికుమార్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి అధ్యక్షుని ప్రమాణ స్వీకారానికి తరలిన నేతలు



సభకు బయలుదేరుతున్న బిజెపి నాయకులు

**ఎల్బినగర్, జూలై 1 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర భారతీయ జనత పార్టీ అధ్యక్షులుగా నూతనంగా నియమించబడిన ఎన్. రామచంద్రరావు అధ్యక్ష పదవి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎల్బీనగర్ నియోజకవర్గం నుంచి బిజెపి నేతలు భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షున్ని వారు సన్మానించారు. కార్పొరేటర్లు చింతల అరుణసురేందర్‌యాదవ్, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, నాయికోటి పవన్‌కుమార్, లచ్చిరెడ్డి, రంగారెడ్డి జిల్లా బిజెపి మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, నాయకులు చింతల సురేందర్‌యాదవ్, ఎలిమినేటి జంగారెడ్డి, పంగ శ్యామ్‌కుమార్, పెట్టా ఉపేందర్‌రెడ్డి, దాసరి జయప్రకాష్, సిద్ధల ఐలయ్య, దేవిడి నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అధికారులతో కలిసి పర్యటించిన ఎమ్మెల్యే



అధికారులతో మాట్లాడుతున్న సుధీర్‌రెడ్డి

**ఎల్బినగర్, జూలై 1 ప్రభాతవార్త:** నాగోల్ డివిజన్ అయ్యప్ప కాలనీలో వాటర్ వర్క్స్, ఇరిగేషన్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి మంగళవారం ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పర్యటించారు.ఈ సందర్భంగా కాలనీవాసులు డ్రైనేజీ, రోడ్ల సమస్యల గురించి ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదనీటి సమస్య పరిష్కారం కోసం బాక్స్ డ్రైన్స్ వేయడం జరిగిందని అన్నారు. బాక్స్ డ్రైన్స్ నిర్మాణం తో మునిగిపోయే ప్రమాదం నుంచి కాపాడమన్నారు. బండ్లగూడా చెరువులో తూములను ఎర్పాటు చేయడంతో పై నుంచి వచ్చే నీటి ప్రవాహాన్ని నాలాల ద్వారా మూసికి పంపడం జరుగుతుందన్నారు. దీంతో స్థానికంగా డ్రైనేజీ సమస్య ఏర్పడిందన్నారు. నివాసాలలోకి నీరు రాకుండా ఉండేందుకు డ్రైనేజీ నిర్మాణం పనులు సక్రమంగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు రమేష్ బాబు, శ్రీనివాస్ రెడ్డి, కనకయ్య, సతీశ్, కాలనీవాసులు నర్సింహాచారి,సతీష్ పాల్గొన్నారు.

## గొప్ప ప్రజానాయకుడు గవర్నర్ బండారు దత్తాత్రేయ



**మలక్‌పేట , జూలై 1, ప్రభాతవార్త:** గొప్ప ప్రజా నాయకుడు గవర్నర్ బండారు దత్తాత్రేయ అని మహారాజ్ గంజ్ శ్రీ సావిత్రి కన్య ఉన్నత పాఠశాల సభ్యుడు, మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ ప్రముఖ వ్యాపారవేత్త కట్టా మల్లేశం పేర్కొన్నారు. గవర్నర్ బండారు దత్తాత్రేయ తన జీవితం మీద రచించిన ఖ్రజల కదే నా ఆత్మ కథఖి పుస్తకాన్ని గవర్నర్ బండారు దత్తాత్రేయ స్వహస్తాలతో వారికి అందజేశారు. ఈ సందర్భంగా కట్టా మల్లేశం మాట్లాడుతూ రాజకీయాలు, పార్టీలతో సంబంధం లేకుండా ప్రజలతో చక్కటి అనుబంధాన్ని పెంపొందించుకున్న గొప్ప వ్యక్తిత్వం ఉన్న మహనీయుడు గవర్నర్ బండారు దత్తాత్రేయ అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికి బండారు దత్తాత్రేయ జీవితం ఆదర్శంగా నిలుస్తుంది అని తెలిపారు. గవర్నర్ బండారు దత్తాత్రేయ యొక్క ఆత్మకథ పుస్తకం ఖ్రజల కదే నా ఆత్మకథఖి పుస్తకాన్ని వారి స్వహస్తాలతో తీసుకోవడం చాలా ఆనందంగా ఉందని, వారు కలకాలం ఆయురారోగ్యాలతో ఉండాలని, నిరంతరం ప్రజల సేవ, దేశ సేవలో ఉండాలని ఆకాంక్షించారు.

## రాంచందర్‌రావు ఎన్నికను స్వాగతిస్తున్నాం : అందెల శ్రీరాములు యాదవ్



రాష్ట్ర బిజెపి నూతన అధ్యక్షుడు రాంచందర్‌రావును సన్మానిస్తున్న అందెల శ్రీరాములు యాదవ్

**సరూర్‌నగర్, జూలై 1 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర బిజెపి నూతన అధ్యక్షునిగా మాజీ ఎమ్మెల్సీ, పార్టీ సీనియర్ నాయకుడు ఎస్.రామచందర్‌రావు ఏకగ్రీవ ఎన్నికను స్వాగతిస్తున్నామని మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. తెలంగాణ భారతీయ జనతా పార్టీ సంస్థాగత నిర్మాణం-2025లో భాగంగా మంగళవారం మన్నెగూడలోని వేద కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్ర బిజెపి నూతన అధ్యక్షుడి ప్రకటన మహోత్సవానికి మహేశ్వరం నియోజకవర్గం నుండి పలువురు నాయకులు, కార్యకర్తలతో కలిసి అందెల తరలివెళ్ళారు. అక్కడ ఆయన పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన రాంచందర్‌రావును శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ రాంచందర్‌రావు రాష్ట్ర బిజెపి సారథిగా ఎన్నికైనందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు నియోజకవర్గ బిజెపి శ్రేణుల తరపున ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. రాంచందర్‌రావు సారథ్యంలో తెలంగాణలో బిజెపి అధికారంలోకి వస్తుందని అందెల ధీమా వ్యక్తం చేశారు.

## జల్‌పల్లి మున్సిపాలిటీ కార్మికులకు సన్మానం



పదవీ విరమణ పొందిన జల్‌పల్లి పారిశుధ్య మహిళా కార్మికులను, వాచ్‌మెన్‌ను సన్మానిస్తున్న సానిటరీ ఇన్స్‌పెక్టర్, జవాన్లు

**సరూర్‌నగర్, జూలై 1 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని జల్‌పల్లి మున్సిపాలిటీలో స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన ముగ్గురు మహిళా పారిశుధ్య కార్మికులను, మున్సిపాలిటీ ఆఫీస్ వాచ్‌మన్‌ను ఘనంగా సన్మానించారు. మున్సిపాలిటీ సానిటరీ ఇన్స్‌పెక్టర్ ఎం. శ్రీనివాస్, జవాన్ బుడమాల కుమార్‌లు తమ స్వంత ఖర్చుతో జల్‌పల్లిలోని మరాఠి భవన్‌లో ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ పదవీ విరమణ అభినందన వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జల్‌పల్లి గ్రామ పంచాయతీగా ఉన్నప్పటి నుండి స్వీపర్లుగా పని చేస్తున్న యాంజాల అమృత, యాంజాల పోచమ్మ, జాన నర్సమ్మలతో పాటు అప్పట్లో కామాటీగా ప్రస్తుతం వాచ్‌మన్‌గా పని చేస్తున్న మంద పెంటయ్య పదవీ విరమణ పొందిన సందర్భంగా వారందరినీ శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలపై బాలాపూర్ ఎమ్మార్వోకు ఫిర్యాదు

**సరూర్‌నగర్, జూలై 1 ప్రభాతవార్త:** బాలాపూర్ మండల పరిధిలోని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో లెనిన్ నగర్ కట్ట మైసమ్మ ఆలయం సమీపంలోనున్న అయోధ్య నగర్‌లో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కొందరు ప్రైవేటు వ్యక్తులు నిర్మిస్తున్న అక్రమ కట్టడాలపై స్థానిక ప్లాట్ యజమానులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బడంగ్‌పేట్‌కు చెందిన తోర్పునూరి సునీల్‌కుమార్ తదితరులు మంగళవారం ఎమ్మార్వోకు లిఖితపూర్వక ఫిర్యాదు చేసి అక్రమ కట్టడాలను తొలగించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లెనిన్ నగర్ కట్ట మైసమ్మ ఆలయ దిగువన ఉన్న ప్రాం తంలో దర్జాగా ప్రభుత్వ స్థలాన్ని అక్రమించిన కొందరు వ్యక్తులు ప్రైవేటు ప్లాట్లకు ఇబ్బందిగా ఉండే విధంగా ఏకంగా బాత్రూంలు, వాష్ ఏరియాలు నిర్మిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రభుత్వ స్థలం ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని కోరారు.

## పివైఎస్ కార్యదర్శిగా కొల్లూరు భీమేష్

**సరూర్‌నగర్, జూలై 1 ప్రభాతవార్త:** ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పివైఎల్) గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శిగా బాలాపూర్ మండలానికి చెందిన కొల్లూరు భీమేష్ ఎన్నికయ్యారు. నగరంలోని మార్క్స్ భవనంలో జరిగిన పివైఎల్ కార్యవర్గ ఎన్నిక సందర్భంగా భీమేష్‌కు కార్యదర్శి పదవికి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సమస్యలపై ఉద్యమించి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని అన్నారు. తనను ఎన్నుకున్న వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.




విరమణ పొందిన బడంగ్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వెంకటనారాయణరెడ్డిని సన్మానించిన మాజీ మేయర్ పారిజాత